కథావేదిక

# గుండెల మీద పండగ

## - ఆకెళ్ల శ్రీరామకృష్ణ

"ఏమైనాసరే మనం వెళ్లేది లేదు. నీకంతగా నా మాట లెక్క లేకపోతే నువ్వు వెళ్ళు. నేను మాత్రం రాను" అన్నాడు గిరీశం.

"అదేమిటండీ! అలా అంటారు. పెళ్ళయిన తరువాత వచ్చే మొదటి పండుగకు వెళ్ళకపోతే మా అమ్మా వాళ్ళు ఎంత బాధపడతారో ఒక్కసారి ఆలోచించండి. మీకు వీలు కుదరకపోతే ఒక్కరోజు వుండి వెంటనే వచ్చేద్దాం" అంది సత్యవతి.

"వాళ్ళేదో అనుకుంటారని నా కోరిక చంపుకుని వెళ్దామంటావా? అయినా నేనేమంత పెద్ద కోరిక కోరానని, ఒక చిన్న టీవీ కొనిమ్మన్నాను అంతేగా. ఆ మాత్రం ఇవ్వలేరా?"

"మా పరిస్థితి మీకు తెలియంది కాదు కదండీ! మా నాన్నగారి సంపాదన అంతంతమాత్రమే. మా తమ్ముడు చదువుకుంటున్నాడు. మా అన్నయ్య చిన్న ఉద్యోగం చేస్తూ తన సంసారం ఖర్చులు పోగా మిగిలిన డబ్బులు పంపుతూంటే మా అమ్మ చాలా గుట్టుగా, ఒర్పుగా నెట్టుకొస్తోంది. అయినప్పటికీ వాళ్ళకి శక్తివున్నంతలో కొత్తబట్టలు పెట్టి, వాచీ కొనిస్తామంటున్నారు, సర్దుకో వచ్చు కదండీ!"

"అల్లుడిగా మామగారింటి నుంటి పండగకి ఏదైనా తెచ్చుకుని నలుగురికీ చెప్పుకోవాలని సరదా వుంటుంది కదా! అంతమాత్రం దానికి మీ కుటుంబ కష్టాలన్నీ నా మూలంగానే వచ్చినట్టు ట్రాజెడీ పండిస్తున్నావేంటి?" సీరియస్‌గా అడిగాడు గిరీశం.

"మీరడగటంలో తప్పులేదండి. కాకపోతే మావాళ్ళ పరిస్థితి కూడా కొంచెం ఆలోచించ మంటున్నానంతే!"

ఈ మాటలు విన్న ఆమె అత్తగారు కొడుకు మెత్తబడిపోతాడేనని వంటింట్లోంచి గబగబా వచ్చి కోడలి వైపు చూస్తూ "వాడేం గతిలేక మీవాళ్ళని అడగడం లేదమ్మా. ఏదో పండగ కదాని ముచ్చటపడుతున్నాడు. అయినా పెళ్ళిలోనే చూసాంగా మీ మర్యాదలేపాటివో?"

"మీరు నన్నండిగానీ, మావాళ్ళనెందుకు అనడం? మావాళ్ళు ధనవంతులు కాకపోవచ్చుగానీ, మర్యాద లోపం మాత్రం చేయరు!" అంది సత్యవతి పౌరుషంగా.

"అబ్బో! బతుకు తక్కువైనా బడాయికేమీ తక్కువ లేదు. అయినా నాకెందుకొచ్చింది..వాడికీ నీకూ ఇష్టమైతే నాకేమిటి..."అంటూ తను వచ్చిన పని పూర్తయిందన్నట్లు అక్కడ్నుంచి తప్పుకుంది కాంతమ్మ.

"చూడు సత్యా, మీకు సరదా వుంటే ఇవ్వండి వస్తాను, లేకపోతే లేదు. ఇంక దీనిమీద వాదనలు అనవరం"అని ఖరాఖండీగా తేల్చేశాడు.

ఆ మాటలు విన్న సత్యవతి నిర్ఘాంతపోయింది. ఎంతవరకూ వాళ్ళమాటే వాళ్ళదేకానీ సాటివాళ్ళ పరిస్థితిని అర్థం చేసుకోరు. ఏం మనుషులో ఏమిటో! తన పెళ్ళికి చేసిన అప్పులతోనే సతమతమవుతున్న పరిస్థితుల్లో తన భర్తకో విలాస వస్తువుకావాలని తాను ఎలా అడగగలదు. అలాగని పండగకి వెళ్ళకపోతే 'మీవాళ్ళు ఆ మాత్రం ముచ్చట తీర్చలేకపోయారంటూ' జీవితాంతం సాధింపులు పడాల్సివస్తుంది. ఏం చేయాలి? తల్లిదండ్రులకు తెలియజేయడం తన ధర్మమనుకుని ఉత్తరం రాసింది.

• • •

ఉత్తరం అందుకున్న సత్యవతి తండ్రి పరంధామయ్య పెదవివిరుస్తూ...

"అసలే జేబులో డబ్బులేక, నాల్గురోజుల్నుంచీ ముక్కఎక్కక ఛస్తుంటే టీవీ కావాలట టీవీ. వాళ్ళు రాకపోతే నాకేంటి నష్టం? నాల్గురోజులు పోతే వాళ్ళేవస్తారు" అనుకుంటూ భార్య చేతికి ఉత్తరాన్ని అందించి తన పని అయిపోయినట్లు బైటికెళ్ళిపోయాడు.

ఉత్తరాన్ని చదివిన శాంతమ్మ ఎలాగైనా అల్లుడి కోరిక తీర్చి, కూతుర్నీ అల్లుడిని పండగకు తీసుకురావాలనుకుంది. లేకపోతే అమ్మాయి వాళ్ళదృష్టిలో చులకనైపోతుంది. కానీ ఎలా? పెళ్ళయిన దగ్గర్నుంచీ భర్త ప్రవర్తన చూస్తూనేవుంది. ఏడాదిపాటైనా నికరంగా ఉద్యోగం చేసింది లేదు. ఉద్యోగంలో చేరిన మరుసటి రోజు నుంచీ తన తోటివాళ్ళు కించపరుస్తున్నారనో, వాళ్ళ పద్ధతి తనకు నచ్చలేదనో దొరికిన ప్రతి ఉద్యోగాన్నీ వదిలేయడం. నలుగుర్ని పోగేసి పేకాట ఆడుతూ, కాలక్షేపంకబుర్లు చెపుతూ, ఆవారాగా తిరుగుతుండడంతో వున్న కాస్త ఆస్తి హారతికర్పూరంలా హరించింది.

పూటగడవడం కూడా కష్టంగావున్నప్పటికీ భర్తఏనాడూ కుటుంబ పరిస్థితి పట్టించుకున్నది లేదు. తను అడక్కుండానే ఎదురు తన ఖర్చులకి డబ్బులిమ్మని ఆయనే గొడవ చేస్తుండడంతో సంసారం వీధిన పడకూడదనే వుద్దేశ్యంతో కిమ్మనకుండా వున్నదంతా ఇచ్చేసింది. ఇప్పుడు ఆస్తిపోయి అప్పు మిగిలింది.

ఇవన్నీ ఇంట్లో విషయాలుకాబట్టి తను తినో తినకో కాలక్షేపం చేసుకుంటూ వచ్చింది. ఇప్పుడెలా? ఒక్కగానొక్క ఆడపిల్ల ఉసూరుమంటుంది. ఏం చేయాలో పాలుపోలేదు. ఆ రాత్రంతా నిద్రపట్టలేదు. ఉన్న అన్నంకాస్త పిల్లాడికి పెట్టింది. మిగిలింది అర్ధరాత్రి వచ్చే భర్తకోసం అట్టేపెట్టింది. తను మాత్రం చెంబుడు మంచినీళ్ళు తాగి మంచంమీద వాలింది.

ఒకపక్క ఆకలి, మరో పక్క ఆలోచనలు. నిద్రపట్టడం లేదు. ప్రేమాభిమానాలున్నప్పటికీ డబ్బులేని మనిషి ప్రాణంలేని బొమ్మతో సమానం. ఎంత ఆత్మీయత వున్నప్పటికీ దారిద్ర్యం అనేది ఆప్యాయతల్ని ప్రదర్శించే అన్నిదారుల్ని మూసేస్తుంది.

ఇంతలో ఒక ఆలోచన మెరుపులా మెరిసింది. తన పుట్టింటారు స్థలం అమ్ముతూ తన సంతకం కోసం తన తమ్ముడు వచ్చి అడిగినప్పుడు ప్రతిఫలాపేక్ష లేకుండా సంతకం చేసింది. అప్పుడు తమ్ముడు "అక్కా! నీకు ఏమైనా కావాలంటే చెప్పు ఇస్తానన్న" విషయం గుర్తుకొచ్చింది. అప్పుడు వద్దంది. ఇప్పుడు అడుగుదామనుకుంది. సమస్యకు మార్గం దొరికి కడుపునిండినట్లయింది. మెల్లగా నిద్రలోకి జారుకుంది.

ఉదయాన్నే తమ్ముడి దగ్గరకు బయలుదేరింది శాంతమ్మ. చార్జీలకోసం భర్తను అడుగుదామంటే తనకంటే ముందే తనకూ డబ్బు కావాలంటూ నానా గొడవ చేసి, తన చిన్నకొడుకు ఎప్పట్నుంచో భద్రంగా దాచుకుంటున్న డిబ్బీని పట్టుకెళ్ళిపోయాడు. వాడు తెల్లచొక్కాకు ఒకవైపు ఎర్రని చారలు వుండే చొక్కా కొనుక్కోవాలని ఎప్పట్నించో ఇంటికి వచ్చిన చుట్టాలు ఇచ్చిన డబ్బులు దాచుకుంటున్నాడు. తాను వాడి కోరిక తీర్చలేకపోయినందుకు లోలోన కుమిలిపోతూ ఎంత అవసరమొచ్చినా ఆ డబ్బులు ముట్టుకోకుండా కాలక్షేపం చేసుకొస్తోంది. అలాంటిది ఇవాళ, ఈయన ప్రవర్తన పట్ల బాధావేశం కలిగింది, కానీ ఏంచేయగలదు? ఇంతలోనే కర్తవ్యం గుర్తుకొచ్చి ఆవేశంతో బయల్దేరింది.

"అమ్మా నేనూ వస్తానమ్మా!" అంటూ కుర్రాడు వెంటపడ్డాడు.

"వద్దురా బాబూ! నేను మావయ్యా వాళ్ళింటికి నడిచి వెళ్తున్నానురా! చాలా దూరంరా బాబూ! నువ్వు నడవలేవు. నాన్నగారి దగ్గరుండు. నేను రేపొద్దున్నే వచ్చేస్తా"నని నచ్చజెప్పచూసింది.


"కాదమ్మా నేను కూడావస్తాను. నేనొక్కడికనే నాన్నగారి దగ్గర వుండలేనమ్మా. ఆయన ఇంటిలో వుండరు. ఒకవేళ వున్నా నామీద కోప్పడుతుంటారు. నేనూ నడుస్తానమ్మా. నిన్నేమీ కొనిపెట్టమని అడగనమ్మా..వస్తానమ్మా" అంటూ ప్రాధేయపడుతున్నవాడిని చూసి కాదనలేకపోయింది. చెట్టుకు పిందె బరువుకాదన్నట్టు

వాడిని తీసుకుని నడక ప్రారంభించింది.

ముప్పై కిలోమీటర్ల దూరం వెళ్ళాలి. పిల్లాడు కొంత దూరం నడిచినప్పటికీ తరువాత నడవలేకపోయాడు. కొంతదూరం ఎత్తుకుంది, మరికొంత దూరం ఎడ్ల బండ్లు వస్తుంటే వాటిలో ఎక్కించింది. అవి కూడా తనకు సహకరించక వేరే మార్గంవైపు వెళ్ళడంతో మళ్ళీ ఇద్దరూ కలిసి నడక ప్రారంభించారు. చివరికి సాయంత్రం దాకా నడిచి, నడిచి ప్రాణం పట్టుతప్పుబోతున్న స్థితిలో తన తమ్ముడింటికి చేరింది. భోజనాలయ్యాక తన తమ్ముడి వచ్చిన పని వివరించింది.

''అలాగే అక్కా నువ్వు అంతగా అడగాలా! రేప్పొద్దున్నే నేను ఏర్పాటుచేస్తాగా! నీవు విశ్రాంతి తీసుకో'' అన్నాడు.

ఆ మాటతో ప్రాణం తిరిగి వచ్చినట్టనిపించింది. నడుంవాలుద్దామనుకునే సరికి నిద్రలో కాళ్ళుకొట్టుకుంటున్న తన పిల్లాడి వంక చూసింది. అంతదూరం




ఎండలో నడిచేసరికి ఆ పిల్లాడి కాళ్ళు బొబ్బలెక్కాయి. అది చూసి ఆ తల్లి మనసు తరుక్కుపోయింది. 'పాపిష్టి దాన్ని, పసిపిల్లాడని కూడా చూడకుండా ఎంత కష్టపెట్టానో' అనుకుంటూ కొబ్బరినూని రాస్తోంది. ఈలోగా పక్కగదిలోంచి మాటలు వద్దంటున్నా వినిపిస్తున్నాయి.

''ఏంటీ! ఇందాకా మీ అక్కగారు అడుగుతుంటే గంగిరెద్దులా తలూపుతున్నారు!'' తన మరదలు గొంతు.

''అది కాదే పాపం! మా అక్క చాలా ఇబ్బందుల్లో వున్నట్టుందే. మన అవసరానికి సాయం చేసింది. ఇప్పుడు మనం చేయకపోతే బావుండదే'' అంటున్నాడు తమ్ముడు.

''అప్పుడు ఆవిడ చేసింది కదాని ఇప్పుడు వున్నదంతా దోచిస్తే రేపు మన పరిస్థితి ఏవిటి? ఏం కొడుకు సంపాదిస్తున్నాడుగా? అయినా పెద్ద పతివ్రతలాగా మొగుడు అడిగిందల్లా చేసి సంసారాన్ని ఈ స్థితికి తెచ్చింది. నేను జాగత్తగలదాన్ని గాబట్టి మా పుట్టింటారి ఆస్తిని కాపాడుకున్నాను. ఏదో మాటవరసకు ఇస్తాంలే అన్నమాటలు పుచ్చుకుని తగుదునమ్మా అని వచ్చేయడమేనా? మీరేమిచ్చుకుంటారో ఇచ్చుకోండి. నాదగ్గర మాత్రం పైసాలేదు'' అంది రైతు ధాన్యం అమ్మి ఇచ్చిన డబ్బు బీరువాలోపెడుతూ.

ఆ మాటలు విన్న శాంతమ్మకు దుఃఖం పొంగుకొచ్చింది. ప్రాణంపోయినట్టయింది. కానీ ఒకొక్కప్పుడు అవసరం అనేది ఆత్మాభిమానాన్ని చంపేస్తుంది. తన పరిస్థితీ అలాంటిదే. అయినాసరే, తమ్ముడి దగ్గర తీసుకోకుండా వెళ్ళిపోవాలనుకుంది. ఉదయం లేచేసరికే తమ్ముడు గదిలోలేడు. కొంతసేపటికి వచ్చాడు.

''అక్కా అర్జంటుగా అంటే నా దగ్గర లేదు. బయటికి వెళ్ళి ప్రయత్నిస్తే పదిహేనువందలు మాత్రం దొరికాయి. వీటితో సర్దుకో'' మని ఛార్జీలకని మరో యాభైరూపాయలు ఇచ్చాడు.

అవి పుచ్చుకోవడం శాంతమ్మగారికి సుతరామూ ఇష్టం లేదు. కానీ అవసరం 'వద్దు' అనే మాటను పెదవి దాటకుండా చేసింది. ఆ డబ్బుతో తిరుగు ప్రయాణమయ్యింది. మిగిలిన డబ్బు ఎలా సమకూర్చాలా అనే ఆలోచనలు బస్సుకన్నా వేగంగా పరుగెడుతున్నాయి.

● ● ●

''ఒరే హరిబాబూ! చెల్లెలు, బావగార్ని పండక్కి రమ్మని పిలవాలిరా. వచ్చిన వాళ్ళను వట్టిచేతుల్తో పంపితే బాగోదు. అందుకని మీ బావగారు టీవీ కొనుక్కోవాలని ముచ్చటపడుతున్నాడట. ఇదే మొదటి పండగ కాబట్టి అదేదో మనమే ఏర్పాటు చేస్తే బాగుంటుంది. అలాగని మొత్తం అంతా నువ్వే భరాయించక్కర్లేదు. నేను మామయ్య దగ్గర నుండి పదిహేను వందలు తెచ్చాను. టీవీ కొనడానికి మూడువేల దాకా అవుతుందంటున్నారు. కాబట్టిమిగతాది ఎలాగోలా నువ్వే ఏర్పాటు చెయ్యాలిరా! ఆడపిల్ల ఉసూరుమంటుందని ఈ పరిస్థితుల్లో నిన్ను ఇబ్బందిపెట్టక తప్పడం లేదు. ఏం చేద్దామంటావు?''

''మళ్ళీ అప్పా ? నావల్ల కాదు. వాళ్ళకే ఇచ్చేవాళ్ళుంటే ఎన్నైనా ఇమ్మంటారు. మన పరిస్థితి కూడా చూసుకోవద్దా?''


''తప్పురా అలా అనకూడదు. అల్లుడు అడగడం, అతని కోరిక తీర్చడం మన సాంప్రదాయం. అదీ మొద

# యమ్మెస్‌రెడ్డి కోపం



సినిమాలలో కొందరు పెద్దలున్నారు. వాళ్లు తాము చాలా గొప్ప మేధావులమని అనుకుంటూ వుంటారు. వాళ్ల ఈగోను భరించడం చాలా కష్టం. అలాంటి పెద్దలలో యమ్మెస్ రెడ్డి ఒకడు. ఆయన ఇప్పుడు 'వెలుగు-నీడలు' అనే సినిమా నిర్మిస్తూ 'మౌర్య' అనే కుర్రాడికి దర్శకత్వ బాధ్యతలు అప్పగించాడు. దర్శకుడి మీద పూర్తి నమ్మకం కలిగినప్పుడే ఆ బాధ్యతను అతడికి అప్పగించి ఆ తర్వాత జోక్యం చేసుకోకపోవడం నిర్మాత ధర్మం. కాని యమ్మెస్ రెడ్డి ఈ చిత్రం విషయంలో ప్రతి అంశంలోనూ జోక్యం చేసుకుంటూ, చివరికి ఒకానొక స్థితిలో దర్శకుడిని కొట్టేందుకూ చెయ్యెత్తాడట. చెయ్యెత్తితే సరే, తనేదో చాలా గొప్ప పని చేయబోయినట్టు ఆ తర్వాత ప్రెస్‌మీట్‌లో ఈ విషయం మరింతా గర్వంగా చెప్పాడు. పాపం! ఆ సమయంలో మౌర్య ముఖం చూడాలి...యమ్మెస్ ప్రెస్ స్టేట్‌మెంట్ చదివి చాలామంది దర్శకులు, అది తమ దర్శకత్వ రంగానికే జరిగిన అవమానంగా ఫీలయ్యారని వినికిడి.

-జె.వి.బాబు




టిపండగ కాబట్టి. ఈ ఒక్కసారి ఎలాగోలా ఇబ్బంది పడు నాయనా!'' అభ్యర్థన పూర్వకంగా అడిగింది.

మొదట కసురుకున్నప్పటికీ తల్లిమాట కాదనలేక ''సరే''అన్నాడు.

కూతుర్నీ, అల్లుడినీ పండుగకు రమ్మని వెంటనే ఉత్తరం రాయించి పోస్ట్ చేయించింది. మర్నాడే పెద్దకొడుకు డబ్బు తెచ్చిచ్చాడు. పెట్టెలో పెట్టబోతుండగా వెనకాలే కోడలు రుసరుసలాడుతూ వచ్చింది.

''రా పద్మారా! ఏంటి అలావున్నావు?'' అంది ఆప్యాయంగా శాంతమ్మ.

''ఒక్కమాట చెప్పండి అత్తయ్యా! మీ అమ్మాయి లాంటి దాన్ని కానానేను?''

''పద్మా?'' గట్టిగా కేకేసాడు హరిబాబు.

''అదేంమాటమ్మా? ఎందుక్కాదు? అసలు ఏం జరిగిందో చెప్పమ్మా?''

''అక్కడికి ఏం తెలీనట్లు ఎలా అడుగుతున్నారో? మీ అబ్బాయినే అడగండి''

''ఏరా బాబూ ఏం జరిగిందిరా?''

''ఏం లేదమ్మా! నువ్వేం ఖంగారుపడకు. ఎక్కడా అప్పు దొరక్క పద్మగొలుసు కుదువపెట్టి డబ్బుతెచ్చాను. రెండు,మూడు నెలల్లో విడిపించేస్తానని చెప్పినా ఇంత రాద్ధాంతం చేస్తోంది.. ''అంటూ ఇంకా ఏదో అనబోయాడు.

''ఆగరా.....తప్పు నాయనా. మన పిల్లకోసమని మననే నమ్ముకొచ్చిన అమ్మాయిని బాధపెట్టడం మనకు క్షేమం కాదురా! ఇటువంటి పనులు ఇంకెప్పుడూ చేయకు. ఈ డబ్బుపట్టుకెళ్ళి వెంటనే పద్మ గొలుసు విడించుకొని రా! వెళ్ళు''

''అది కాదు అమ్మా..మరి బావగార్కి టీవీ....''

''అది నీ కనవసరం. నేను చూసుకుంటాను... నువెళ్ళు''అంది గద్దించినట్లుగా.

పుట్టిబుద్ధిఎరిగిన తర్వాత ఎన్నడూ తల్లికళ్ళల్లో అంత ఆవేశాన్ని చవిచూడని హరిబాబు వెంటనే డబ్బుచ్చుకుని వెళ్ళిపోయాడు.

''మీరేం అనుకోకండి అత్తయ్యా! అది మానాన్నగారు నాకోసమని ప్రత్యేకంగా మద్రాసునుంచి పట్టుకొచ్చారు. అది అడిగితే నేనేమని వాళ్ళకి సమాధానం చెప్పాలో తెలీక ఖంగారుపడ్డాను.''

''నీ తప్పేంలేదమ్మా! చూడమ్మా పద్మా! తెలిసొతెలీకో వాడు తీసుకొచ్చాడు. ఇంకెప్పుడూ ఇలా జరగకుండా చూస్తాను. వాడు దాన్ని తీసుకొచ్చాక మెడలో వేసుకుని పండక్కి మీ ఇద్దరూ కూడా రండి.''అని సర్ది చెప్పి పంపించింది.

శాంతమ్మకి ఏం చేయాలో పాలుపోవడం లేదు. పండగ దగ్గరకొచ్చేస్తోంది. ఆపద్బాంధవులుగా సుందర్రామయ్య, ఆయన భార్య సుబ్బలక్ష్మి గుర్తుకొచ్చారు. వాళ్ళిద్దరూ తమ కుటుంబానికి అత్యంత సన్నిహితులు. ఈ సందర్భంలో వారేదన్నా సలహా ఇస్తారేమోనని వాళ్ళ ఇంటికి వెళ్ళింది.

''వదినగారూ! చాలా అవసరం వచ్చింది. పండక్కి మా అమ్మాయి, అల్లుడు వస్తున్నారు. మీరు మరోలా అనుకోకపోతే ఒక పదిహేనువందల రూపాయలు వుంటే సర్దుతారా? మళ్లీ వీలైనంత త్వరలోనే ఇచ్చేస్తానని'' అవసరం అభిమానాన్ని అణగదొక్కుతుండగా అడగలేక అడిగింది.

''చాల్లే వదినా! దీనికి మీరు ఇంతగా అడగాలా ఏమిటి? మీ అన్నయ్యగారింట్లో లేరు. బజార్లోకెళ్లారు. రాగానే ఏర్పాటు చేస్తారులెండి! మీరు ఎన్నడూ వచ్చి అడగలేదు. అలాగేలెండి. ఆయన రాగానే నేను పట్టుకొచ్చి ఇస్తానంది''

ఆ మాటలకు పరవశించిపోయింది శాంతమ్మ. చుట్టాలు, బంధువులు ఎంతమందున్నప్పటికి అందరూ అక్కరకురాని వారౌతుంటారు. తోటి వారే అవసరానికి ఆదుకుని ఆత్మబంధువులనిపిస్తారు. ఆక్షణం ఆమెకలా అనిపించింది. కొంతమంది అప్పుచేసి అరక్షణంలో మర్చిపోతారు. కానీ శాంతమ్మకలా కాదు. అప్పు చేయడానికి మనస్సంగీకరించదు. ఒకవేళ విధిలేక చేసినా అది తీర్చేదాకా ఆమెకు నిద్రపట్టదు. కానీ సుందర్రామయ్యగారు తన తోడబుట్టిన అన్నలా చనువుగా కలిసిమెలిసివుంటారు కాబట్టి అడగకతప్పలేదు.

ఆయన వెంటనే భార్యతో డబ్బులు పంపించారు.

''ప్రస్తుతానికి మీ అన్నయ్యగారి దగ్గర వెయ్యి రూపాయలు మాత్రమే వున్నాయట. మిగిలినవి నాలుగైదు రోజుల్లో ఏర్పాటు చేస్తామని చెప్పారు''అంది సుబ్బలక్ష్మి.

''ఇవి సరిపోతాయిలే వదినా. ఇప్పటికే మిమ్మల్ని ఇబ్బందిపెట్టాను''అని మొహమాటపడింది.

ఇప్పటికి రూ.2,500/-లు పూడింది. మిగతాది ఎలా పూడ్చాలి? ఎలా?? ఎలా??? మధ్యతరగతి జీవితాలింతే నిద్రలేచించి మొదలు నిద్రకుపక్రమించేవరకూ ప్రశ్నలే. వాటికి సరైన సమాధానం డబ్బు. ఊహ తెలిసినప్పటి నుంచీ ఊపిరివున్నంత వరకూ డబ్బుకొరకు పోరాటం చేయాల్సిందే. ఉన్నది సరిపోక, లేనిది సమకూర్చుకోలేక బాధ్యతలతో నిండిన బ్రతుకు బరువును భరిస్తూ అనుక్షణం సతమతమవ్వాల్సిందే.

• • •

''బాబూ! మీ అమ్మగారున్నారా?''

''వున్నారండి''

ఎవరో పిలుస్తున్నట్టున్నారని శాంతమ్మ బయటికి వచ్చి చూసింది. ప్రక్కవీధిలోనుంటున్న సావిత్రమ్మగారు.

''మీరా! రండి. ఏమిటి ఇలావచ్చారు?''

''ఏం లేదమ్మా, మీ సహాయం కోరివచ్చాను. మీరు ఏమిఅనుకోనంటే చెపుతాను.''

''ఫర్వాలేదు చెప్పండి.''

''ఏం లేదమ్మా. పండక్కి మా ఇంటికి మా కూతుళ్ళు,

అల్లుళ్ళు, కొడుకులు, కోడలు వాళ్ళపిల్లలందరూ వస్తున్నారు. నేనా ఒక్కదాన్నే. అన్ని పనులు చేసుకోలేక సతమతమవుతున్నాను. వాళ్ళు అందరూ అంతతంత దూరాల్నించి రాకరాక వస్తున్నారు. వారికి ఇక్కడి వంటకాలంటే చాలా ఇష్టం. నాకా చేసే ఓపిక లేదు. కాబట్టి మీరు మరోలా భావించకుండా వుంటానంటే నాకు కొంచెం చేతిసహాయంగా వుండి కాజాలు, లడ్డూలు చేసిపెడతారేమోనని అడగడటానికి వచ్చాను. నా కూతురులాంటిదానివే. పెద్దదాన్ని అడుగుతున్నాను, కాస్త సాయం చేసిపెట్టమ్మా'' అని ప్రాధేయపూర్వకంగా అడిగింది.

శాంతమ్మ ఆలోచనలోపడింది. సావిత్రమ్మగారిది లంకంత కొంప. సిరిసంపదలకు కొదవలేదు. అయినప్పటికీ అనుభవించడానికి అందులోబాటులో నాఅన్నవారెవరూ లేరు. అందరూ ఉద్యోగాలు, వ్యాపారాలంటూ దూరంగానే వుంటున్నారు. అంత డబ్బువున్నప్పటికీ ఆమెలో గర్వంలేదు. పెద్దావిడ తనింటికి వచ్చి అడిగింది. తప్పేంటి? అభిమానపడితే అవసరాలు తీరవుకదా! వెళ్ళడానికే నిశ్చయించుకుంది. అలాగే వస్తానని చెప్పి ఒప్పుకుంది. రెండుమూడు రోజులపాటు పగలు, రాత్రి అనే తేడాలేకుండా సావిత్రమ్మగారికి కావాల్సినవన్నీ సమకూర్చిపెట్టింది. ఆమె చాలా సంతోషించింది. ఆమె చీరతోపాటు ఆరువందల రూపాయలిచ్చింది. శాంతమ్మ సంతోషానికి అవధుల్లేవు. టీవీ డబ్బుతోపాటు తన కూతురుకు చీరకూడా అమరిందని సంతోషించింది.

• • •

పండగరోజు రానే వచ్చింది.

కూతురు అల్లుడు, కొడుకు కోడలు అందరూ వచ్చారు.

శాంతమ్మగారు హడావిడి పడుతూ అందరికీ అన్నీ అమర్చిపెడుతూవుంది. అల్లుడికి ఇష్టమని అరిసెలు చేస్తుండగా వచ్చిన పొగతో ఊపిరిసలపని దగ్గువచ్చింది. దాంతో గుక్కతిప్పుకోలేక స్పృహ తప్పి పక్కకు ఒదిగిపోయింది. అక్కడేవున్న ఆమె కూతురు, కోడలు చుట్టూరా చేరి సపర్యలు చేయసాగారు.

''అమ్మపడిపోయింది'' జీరబోయిన గొంతులో అంది కూతురు.

ఒకరు డాక్టరు దగ్గరకు పరుగెత్తారు.

''ఇదంతా నీ మూలానే జరిగింది. మీ కోర్కెలు తీర్చడం కోసమని అమ్మ అహోరాత్రులు కష్టపడింది. ఇంతమందిమి వుండి కూడా అమ్మ పరిస్థితి ఎలా అయిందోచూడు?'' తల్లి పరిస్థితి చూసి ఆవేశం పట్టలేని పెద్దకొడుకు చెల్లెలిపై ధ్వజమెత్తాడు.

''ఏం జరిగిందో చెప్పకుండా? నా మీద విరుచుకుపడతావేంటి?'' అడిగింది చెల్లెలు.

అన్నగారు తను చూసినవి, తమ్ముడి ద్వారా విన్నవి అంతా వివరించి చెప్పాడు.

అది విన్న కూతురు నిర్ఘాంతపోయింది. బావమరిది మాటలు శూలాల్లా గుచ్చుకుని బావగారి మనసులో కించిత్ కదలిక వచ్చింది. డాక్టరుగారొచ్చి పరీక్ష చేసి, ఆమెకు చాలా నీరసంగా వుందని, విశ్రాంతి చాలా అవసరమని, మందులు రాసిచ్చి వెళ్ళారు. కొంచెం సేపటికి స్పృహలోకొస్తున్న తల్లిని చూసి ''ఎందుకమ్మా నాకోసం ఇంత కష్టపడ్డావు? నీకేమైనా అయితే మా పరిస్థితి ఏంటమ్మా?...'' అంటూ భోరుమంది కూతురు.

''పిచ్చితల్లీ! వూరుకోమ్మా. నీకోసం ఏంటి తల్లీ. ఇది మా బాధ్యతమ్మా. అయినా నాకేం కాలేదంటూ'' మిగిలిన వంటను పూర్తి చేయడానికి లేవబోయింది.

''మీరు లేవకండత్తయ్యా మిగతా పనులు సత్యవతి చూసుకుంటుందిలే'' అన్నాడు అల్లుడు అభిమానం వొలకబోస్తూ.

''ఫర్వాలేదు నాయనా!''

''మీరంత శ్రమపడ్తారని తెలిస్తే నేనసలు అడక్కపోదునండీ! మాకేమీ వద్దులెండి. మేం వెళ్ళిపోతాం'' అన్నాడు అల్లుడు సడ్డిస్తూ.

''అలా అనకు నాయనా! దీనికోసం నేను చేసిన ప్రయత్నమంతా వృధా అవుతుంది. మా హరికి ఏమీ తెలీదు. వుట్టి ఆవేశం తప్ప.

మీరంతా సంతోషంగా వుండడమే నాక్కావాల్సింది'' అంటూ బ్రతిమాలి మరీ టీవీ ఇచ్చి పంపించింది. సంతోషంగా సాగనంపింది. సంతోషంతో వెలుతున్న కూతురి ముఖంలో ఆమెకు వెయ్యిటీవీల కాంతి కనిపించింది.

• • •

ఇంటికెళ్ళిన గిరీశం జరిగిందంతా తన తల్లికి వివరించేసరికి, ఆమె తేలిగ్గాతీసిపారేస్తూ

''ఆ! అదంతా ఒట్టి నాటకంరా! మళ్ళీ ఏమైనా అడుగుతావేమోనని అదో ఎత్తుగడ. పండక్కి అల్లుడి కోరిక తీర్చడం వీళ్ళకే వుందా? ఏమిటి? అందరికీ వుంది. దానికేదో వాళ్ళు వెండీ, బంగారాలు తొడిగేసినట్టు పెద్ద హంగామా. ఇంతచేసి చిన్న టీవీయే ఇచ్చారు. ఈసారి పండక్కి మాత్రం స్కూటరు కావాలని అడగడరా అబ్బాయి. నీకసలే ఏమీ తెలీదు'' అంటూ కొడుక్కి హితబోధచేసింది.

'అవును. నేనుమాత్రం నాఒక్కడి కోసమేనా అడిగింది. సత్యవతి మాత్రం చూడదూ?. రేప్పొద్దున్న స్కూటర్ ఇస్తే వాళ్ళమ్మాయి కూడా నాతో దర్జాగా తిరుగుతుంది కదా!' అనుకుంటూ దాన్ని ఏరకంగా అడగాలా అనే ఆలోచనలో పడ్డాడు గిరీశం టీవీ చూస్తూ. ఇచ్చేవారిని చూస్తే అడిగేవారికి లోకువ. తరాలుమారినా బుద్ధులు మాత్రం మారవు. ఎన్ని యుగాలైనా కుక్కతోక వంకరే మరి.

★

## మనీ మాట

మనీ అన్న పదం యదార్థానికి ఆంగ్ల పదం కాదు. ప్రాచీన రోమన్స్ తమకు సంతానం కలిగినప్పుడు తమ దేవత అయిన 'జోనోమానిడా' కు బంగారు, వెండి బిళ్లలు కానుకగా సమర్పించేవారు. దేవతలకు సమర్పించే ఈ కానుకల్ని 'మాని' అని వ్యవహరించేవారు. అవసరం అయినప్పుడు వీటినే నాణేలుగా కూడా ఉపయోగించి క్రయ విక్రయాలు చేసేవారు. ఇలా మనీ అన్న పదం పుట్టింది.

## చైనా ఐస్‌క్రీం

ఐస్‌క్రీమ్‌ను మొట్టమొదటగా 13వ శతాబ్దంలో చైనీయులు కనిపెట్టారు. మంగోల్ చక్రవర్తి కుబ్లయ్ ఖాన్ (1260-1295) రాజ్యసభ వెలుపల ఎవరూ ఐస్‌క్రీమ్ తయారుచేయరాదని ఆంక్ష విధించాడు. కానీ దీన్ని తయారుచేసే విధానం గల పట్టికను మార్కో-పోల్‌కు ఇచ్చాడు. అతడు దాన్ని ఇటలీ రాజసభకు సమర్పించాడు. 16వ శతాబ్దం వరకు ఇటాలియన్ రాజకుటుంబంలోనివారు దీన్ని రహస్యంగా వుంచి కాపాడారు. 1500 సంవత్సరం తరువాత ఒక ఇటలీ రాజు దీన్ని ఫ్రెంచి రాజసభకు అందజేశాడు. ఆఖరికి ఈ రహస్యం ఫ్రాన్స్‌లో బట్టబయలైపోయింది. సామాన్య ప్రజానీకానికి ఐస్‌క్రీమ్ శ్రమను తీర్చే ఒక అల్పాహారంగా తయారైంది. 1777లో న్యూయార్క్ (యు.ఎస్.ఎ) నుండి ప్రచురించబడుతున్న ఒక వార్తాపత్రికలో ఐస్‌క్రీమ్‌కు సంబంధించిన ప్రకటన వెలువడింది.

\- శ్వేత

